

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి : పల్లా

జనగామ, మే 7 (నమస్తే తెలంగాణ) : యువత క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్టిన్‌గ్రౌండ్‌లో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల బహుమతి ప్రదానంలో ఆయన మాట్లాడారు. ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతను ఆటల పోటీల్లో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం సమాజాన్ని డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్‌లు పీడిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌కు యువత బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి, ఆర్థికంగా నష్టపోవడంతో మానసిక ఒత్తిడికి గురై కుటుంబాలను ఆగం చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలు, ప్రవర్తనపై శ్రద్ధ పెట్టాలని, ఆన్‌లైన్ కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఎర్రగొల్లపహాడ్ వర్సెస్ ఓబుల్‌కేశ్వాపూర్ మధ్య జరగగా, ఓబుల్‌కేశ్వాపూర్ జట్టు విజేతగా నిలిచింది, రెండో బహుమతి ఎర్రగొల్లపహాడ్ గెలుచుకుంది. రన్నర్, విన్నర్లకు ఎమ్మెల్యే పల్లా చేతుల మీదుగా ట్రోఫీలు, నగదు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజమౌళి, డాక్టర్ ప్రీతిదయాళ్, జేరిపోతుల పరశురామ్, మాజీ కౌన్సిలర్లు ముత్యాల దయాకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, మసియొద్దీన్, గుర్రం నాగరాజు, కొమ్ము రాజు, సంపత్, కృష్ణ, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్ల రాహుల్, కౌశిక్, బిట్ల చిన్న, నిహారిక, స్వప్న పాల్గొన్నారు.

## అయ్యా.. మీ దవాఖానకే పోతా..

**ఎమ్మెల్యే పల్లాతో వృద్ధురాలు యాదమ్మ**



యాదమ్మను ఆత్మీయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మే 7 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో బీఆర్ఎస్ పట్టణ నాయకుడి సంతాపసభకు హాజరై తిరిగి వెళ్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని వృద్ధురాలు యాదమ్మ కరచాలనం చేసి ఆత్మీయంగా మాట్లాడింది. 'అయ్యా నేను మీ ఘట్‌కేసర్‌లోని నీలిమ దవాఖానకు పోత.. అక్కడ పైసలల్లేకుండా అన్ని పరీక్షలు చేసి ఆపరేషన్లు కూడా చేసి మందులు ఇస్తున్నరట కదా.. పానం బాగాలేదు సారూ జెరంత చెప్పుండ్రి..' అని విజ్ఞప్తి చేసింది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే 'అయ్యో అమ్మా.. తప్పకుండా ఇప్పుడే చెబుతా.. రేపు పొద్దున్నే దవాఖానకు పో.. అక్కడి సార్లకు నేను చెబుతా.. ఏమైనా అవసరం ఉంటే నాకు ఫోన్ చేయి..' అని ఓ చిట్టీ మీద ఎమ్మెల్యే పల్లా తన ఫోన్ నంబర్‌ను రాసి ఇచ్చాడు. దీంతో అవ్వ కండ్లలో ఆనందం కనిపించింది.. సారూ సల్లంగ ఉండుండ్రి.. కేసీఆర్ సారూ ఉన్నప్పుడే మంచిగుండె.. మల్లెప్పుడు ఆ రోజులు వస్తాయో అంటూ ఇంటి ముఖం పట్టింది.

## పేదల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

నర్మెట, మే 7: పేదల సమస్యల పరిష్కారానికి కమ్యూనిష్టు పార్టీ పోరాటం చేస్తుందని జనగామ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ మండల మహాసభ గజ్జెల్లి వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజారెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందన్నారు. హామీలు అమలు చేసే వరకూ ప్రజలు పోరాటం చేయాలని ఆయన కోరారు. అనంతరం మండల మండల కార్యదర్శిగా పాతూరి ప్రశాంత్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా మాలోత్ సీతారాంనాయక్‌ను ఎన్నుకున్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సాయి (ఫైల్)

జనగామ రూరల్, మే 7 : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ మండలం మరిగడిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిగడికి చెందిన కురాకుల సాయి(25) కొంతకాలంగా హైదరాబాద్‌లో కోళ్ల వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో తనకు కారు కొనివ్వాలని తల్లిదండ్రులను కోరగా వారు నిరాకరించడంతో బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చే సుకున్నాడని పోలీసులు తెలిపా రు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK
For All Your Septic Tank Needs

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-337056

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి

జనగామ చౌరస్తా, మే 7 : ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 249 మంది ఎరువుల డీలర్లకు ఈ–పాస్ యంత్రాలను ఆయన పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల డీలర్లు తమ లైసెన్స్ కాలపరిమితి సరి చూసుకోవాలని తెలిపారు. కంపెనీలకు చెందిన ఉత్పత్తులను విక్రయించాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డీ రామారావు నాయక్, సహాయ సంచాలకులు వసంత సుగుణ పాల్గొన్నారు.

# 'సన్న'గిల్లిన ఆశలు..

- కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయని సన్నవడ్లు
- పక్షం రోజుల నుంచి కొడకండ్లలో ఇదే దుస్థితి
- పట్టించుకోని అధికారులు



నర్సింగపురంలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేయని సన్న వడ్లు

కొడకండ్ల, మే 7 : సన్నవడ్ల కొనుగోలులో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం రైతులకు ఆశనిపాతంలా మారింది. సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఎన్నో ఆశలు పెట్టుకుని సాగు చేశారు. కానీ కొనుగోలు కేంద్రాల్లో 20 రోజుల నుంచి సన్నవడ్లను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న దుస్థితి కొడకండ్ల మండలంలో నెలకొంది. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం రాసులు అలాగే ఉండడంతో అకాల వర్షాల మూలంగా మొలకలు వస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**సన్నధాన్యం కొంటరా.. కొనరా.?**

బోనస్ మాట అటుంచి సన్నవడ్లను కొనుగోలు చేస్తరా.. చేయరా..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో గత వానకాలంలో సన్నరకం వరిని 6,087 ఎకరాల్లో సాగు చేయగా 1,52,170 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. యాసంగిలో 1,694 ఎకరాల్లో వేయగా 42,650 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. దొడ్డురకం వరిని వానకాలంలో 4,058 ఎకరాల్లో సాగు చేయగా 1,05,500 క్వింటాళ్లు వచ్చాయి. యాసంగిలో 9,596 ఎకరాల్లో సాగు చేయగా 2,39,900 క్వింటాళ్ల ధాన్యం వచ్చింది. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని సర్కారు ప్రకటించడంతో ఎంతో ఆశతో వానకాలంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసినా రైతుందరికీ రాయితీ అందలేదు. దీంతో నిరాశ చెందిన రైతులు యాసంగిలో సన్న ధాన్యాన్ని తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రస్తుతం మండలంలో ఐకేపీ నేతృత్వంలో 10 కొనుగోలు కేంద్రాలు, సొసైటీ నుంచి రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సన్నధాన్యం కేవలం 2,300 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. అయి నా రైతులకు నేటికీ వారి బ్యాంకు అకౌంట్లలో నగదు జమ కాలేదు. రెండు రోజుల్లో డబ్బులు జమ కావాల్సి ఉన్నా కేంద్రాల నిర్వాహకులు, అధికారులు నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందికరంగా మారింది. మరోవైపు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో కొనుగోలులో జాప్యం నెలకొంటున్నదని, ఫలితంగా ధాన్యం ఎండకు ఎండుతూ వానలకు తడుస్తూ మొలకొస్తున్నదని వివరించారు.

### 20 రోజులైనా సన్న వడ్లు కొంటలేరు..



మేము వరి కోసి 20 రోజులైంది. దొడ్డు రకం ధాన్యం 49 బస్తాలు, సన్నరకం 180 బస్తాలు దిగుబడి వచ్చింది. వీటిని మా గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తరలించినం. ఇప్పటి వరకూ తూకం వేయడం లేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. తేమ లేకుండా ఆరబోయడంతోపాటు మాయిశ్చర్ పట్టినం. అయినా కాంటా పెడతలేరు, మిల్లుకు తోలుతలేరు, మమ్ములను ఆగం పట్టిస్తుర్రు. దొడ్డు వడ్లు మాత్రమే కాంటా పెట్టిండ్లు. సన్న వడ్లు తీసుకోవడం లేదంటే లారీలు లేవు అని చెబుతున్నరు. బోనస్ కోసం చూస్తుంటే సన్నవడ్లు పోయేటట్టు ఉన్నయ్. ఇప్పటికైనా వడ్లు కొనాలె.

– దండెంపల్లి రవి, రైతు, నర్సింగపురం

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్



సైకిళ్లను పొందిన విద్యార్థులతో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, మే 7 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభకనబర్చిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు చెందిన హెచ్ఎంలకు 'విజయోస్తు సన్మాన స భ' నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సెస్సీ ఫలితా ల్లో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లాకు మూడో స్థానం రా వడం గర్వకారణమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయోస్తూ సన్మాన సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అందించిన స్మార్ట్ లెర్నింగ్ మెటీరియ ల్ ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. అనంతరం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో ఉత్తమ మార్కులు సాధించిన 23 బాలబాలికలకు సైకిల్స్‌ను బహుమతిగా పంపిణీ చేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 129 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ప్రశం సా పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడొద్దు

జనగామ చౌరస్తా, మే 7 : ధాన్యం కొనుగోళ్లలో కోతలకు పాల్పడొద్దని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి రైస్ మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్స్‌తో ఆయన సమీక్ష నిర్వహించారు. రోహిత్‌సింగ్ మాట్లాడుతూ అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగులతో పాటు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీఎస్‌వో సరస్వతి, సివిల్ సప్లై డీఎం హతీరామ్, ఆర్డీవో శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## పాఠశాలలను విద్యాశాఖ పర్యవేక్షించాలి

స్టేషన్ ఘన్‌పూర్, మే 7 : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని బీఆర్ఎస్వీ నియోకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి కోరారు. బుధవారం డీఈవో భోజన్నను డీసీఈబీ సెక్రటరీ గుగులోత్ చంద్రభానుతో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగ్, యూనిఫాం, టై, బెల్టు పాఠశాలల యజమానులే అధిక ధరలకు విక్రయిస్తున్నందున చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి డీఈవో సానుకూలంగా స్పందించినట్లు చిరంజీవి తెలిపారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

బచ్చన్నపేట, మే 07 : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరు తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనుకారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పర్వతం నర్సింహులు అధ్యక్షన కార్యకర్తల సమావేశం జరిగింది. కనకారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న ప్రధాని మోదీ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డిజీల్, వంటగ్యాస్ ధరలు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారా లు మోపారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలులో విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో కాంగ్రెస్ నేతల చేతివాటం కొనసాగుతున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మం డల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, నాయకులు ఎల్ల య్య, ఈదమ్మ, బలరాములు, రాజు పాల్గొన్నారు.

## సీఈఐఆర్ పోర్టల్‌పై అవగాహన కలిగి ఉండాలి : డీసీపీ



బాధితులకు సెల్‌ఫోన్లు ఇస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ చౌరస్తా, మే 7 : సెల్‌ఫోన్ వినియోగదారులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ (సీఈఐఆర్)పై అవగాహన కలిగి ఉండాలని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. ఇటీవల పలువురు పోగొట్టుకున్న 82 సెల్ ఫోన్లను బుధవారం జనగామ అర్బన్ పీఎస్‌లో ఆయన అప్పగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిన తర్వాత సెల్ ఫోన్లు చోరీకి గురవడం లేదా అజాగ్రత్తగా పోగొట్టుకోవడం సాధారణంగా జరుగుతున్నదని తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వెంటనే సమీపంలో ఉన్న మీసేవా కేంద్రాలకు లేదా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి https//www.ceir.gov.in వెబ్‌సైట్ పోర్టల్ ద్వారా తమ ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయొచ్చని పేర్కొన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా ప్రజలు విహార యాత్రలకు, ఫంక్షన్‌లకు వెళ్లినపుడు పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు ఎం భరత్, రాజేశ్ కుమార్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయాలి

పాలకుర్తి, మే 7: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ రాపాక శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. అర్హులకే ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి మాట తప్పిందని విమర్శించారు. నాయకులు ఈదునూరి ప్రసాద్, ఇన్‌చార్జి బండి పెల్లి యాదగిరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులతో రాజయ్య

## మృతుడి కుటుంబానికి పరామర్శ

చిల్పూరు, మే 7 : మండలంలోని పల్లగుట్టకు చెందిన ఐలపాక జాన్‌రాజ్ బుధవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నిజమైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

జనగామ చౌరస్తా/లింగాలఘనపురం, మే 7 : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందించడం ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్ష నిర్వహించారు. గౌతమ్ మాట్లాడుతూ నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం 600 స్క్వేర్ ఫీట్ కన్నా ఎక్కువ కాకుండా, 400 స్క్వేర్ ఫీట్ కన్నా తక్కువ కాకుండా నిర్మించాలని తెలిపారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి ఒక దఫా డబ్బులు కూడా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి చేశామన్నారు. మొదటి విడత ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి బాగుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల మార్కింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల్లో అర్హుల ఎంపిక కోసం చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలన్నారు. అంతకు ముందు లింగాలఘనపురం మండలం కొత్తపల్లి, వనపర్తిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవో గోపీరామ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చైతన్య కుమార్, ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

**జిల్లా వ్యాప్తంగా అమ్మవారికి ఆర్యవైశ్యుల పూజలు**



పాలకుర్తిలో జరిగిన కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకల్లో ఆర్యవైశ్యులు

నర్మెట/రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్/ పాలకుర్తి/జఫర్‌గఢ్, మే 7: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యా ప్తంగా నిర్వహించారు. నర్మెటలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నుంచి జోపర్తి ఉపేందర్, రామిని శివరాజు, సారాబు మధు, మెతుకు మధు, చంద్రం, లక్ష్మీనారాయణ, సిద్దులు పాల్గొన్నారు. రఘునాథపల్లి మండల కేంద్రం లో వాసవీ మాతను భక్తులు పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. కంచనపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఎంపికైన ఐత జయరాములును ఆవోపా నాయకులు సత్కరించి అభినందించారు. సంఘం మం డల అధ్యక్షుడు తుమ్మలపల్లి సోమేశ్వర్, మాజీ సర్పంచ్ పోకల శివకుమార్, నాయకులు బచ్చు శ్రీనివాస్, ఓరుగంటి శంకర్‌లింగం, గజ్జి వీరవ్రజయ్య, పోకల హరిప్రసాద్, శంకరయ్య, లగిశెట్టి భిక్షపతి పాల్గొన్నారు. శివునిపల్లిలోని నగరేశ్వరాలయంలో వాసవీమాతకు పూజ లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ సభ్యులు యాదా శ్రీనివాస్, అంచూరి శ్రీరాములు, జొన్నల మహేందర్, బెలిదె వెంకన్న, పార్సి రంగారావు, గౌరిశెట్టి శ్రీనివాస్, జిల్లా రాములు, సరాబు ఆంజనేయు లు, పడకంటి కృష్ణమూర్తి, వెంకట్రాంనర్సయ్య, పాల్గొన్నారు. పాలకుర్తి మం డల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చారగొండ్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి తమ్మి రాంబాబు, పట్టణ అధ్యక్షుడు రాపాక రఘు ఆధ్వర్యంలో వాసవీ మాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారం శ్రీనివాస్, చారగొండ్ల శివ, బొగ్గారపు నాగరాజు, అరూరి రవి, నంగూనూరి మహేశ్, రాపాక అనిల్, రాపాక కన్యకపరమేశ్వరి, ఇమ్మడి శ్రీలత, బొగ్గారపు దివ్యజ్యోతి పాల్గొన్నారు. జఫర్‌గఢ్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో మరిపెడ(బంగ్లా) వాసవీమాత పీఠాధిపతి అనిల్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతిని నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమ పూజ, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో రెవెన్యూ అధికారుల సర్వే



విశ్వనాథపురంలో సర్వే చేస్తున్న అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, మే 7 : భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు నిర్వహించిన గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో అధికారులు సర్వే చేపట్టారు. జిల్లా లో స్టేషన్ ఘన్‌పూర్ మండలాన్ని పైలెట్ ప్రా జెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో మూడు రోజులుగా మండలంలో రోజుకు రెండు గ్రామాల చొప్పున సదస్సులను నిర్వహిస్తున్నారు. బుధవారం మీదికొండలో 80, నమిలిగొండలో 39 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. విశ్వనాథపురంలో తొమ్మిది మంది రైతులకు చెందిన వ్యవసాయ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో కొడకండ్ల మండలం తహసీల్దార్ చంద్రమోహన్ తన సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి మోకాపై ఉన్న రైతుల వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు సతీశ్, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, జేసుమని, కొడకండ్ల ఆర్ఐ సుమన్, సర్వేయర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## హైవేపై ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు




బోర్డును ఏర్పాటు చేస్తున్న పోలీసులు

దేవరుప్పుల, మే 7: మండల కేంద్రంలోని సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై సింగరాజుపల్లి నుంచి మన్‌పహాడ్ వరకు మూలమలుపుల్లో ప్రమాదాల నివారణకు పోలీసులు బుధవారం హెచ్చరికల బోర్డులు ఏర్పా టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు. గొల్లపల్లి వంతెన మూలమలుపుపై, కామారెడ్డిగూడెం పరిధిలోని ఎంఎన్నార్ గార్డెన్, సింగరాజుపల్లి– బంజర మధ్యలో, చింతబావితండా వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మసూద్ పాల్గొన్నారు.

## వ్యవసాయక్షేత్రాలకు రోడ్డు వేసిన రైతులు

దేవరుప్పుల, మే 7: మండల కేంద్రం నుంచి గడ్డ చెలుకకు వెళ్లే మూడున్నర కిలోమీటర్ల దారి గుంతలమయం కావడంతో రైతులు శ్రమించారు. గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరైనా పనులు చేయకపోడంతో ట్రాక్టర్లతో మొరం పోశారు. నడిచి వెళ్లేందుకు సైతం దారి సరిగా లేకపోవడంతో రైతులే సొంతంగా డబ్బులు వెచ్చించి రహదారి నిర్మించారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేలా 101 మంది రైతులు రూ. 50 వేలు జమ చేశారు. 60 ట్రాక్టర్ల మట్టిని తెప్పించి, గుంతల్లో పోసి చదును చేయించారు. దీంతో తాము ఇన్నాళ్లు పడుతున్న కష్టాలు తీరాయని పలువురు తెలిపారు.

## ఆత్మ రక్షణకు కరాటే దోహదం

బచ్చన్నపేట, మే 7 : ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుందని కరాటే మాస్టర్ పెచ్చెట్టి త్రివిక్రమ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కరాటేలో మెళకువలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. కరాటేలో వారంలో మూడు రోజులు శిక్షణ ఉంటుందన్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. తల్లితండ్రులు పిల్లల ఆరోగ్యం, ఆత్మరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. శిక్షణ పొందేందుకు 9848946191చ 7569542392 నంబర్లకు పోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

## ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల, మే 7: ఆర్యవైశ్య సంఘం మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ధర్మాపురానికి చెందిన ఇరుకుల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దేవరుప్పులకు చెందిన వనమాల శ్రీనివాస్, కోశాధికారిగా యామ సంతోష్‌ను ఎన్నుకున్నారు. కాగా అంతకు ముందు వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు బుక్క రామయ్య, బెలిదె నర్సయ్య, బుక్క సత్యనారాయణ. జూలకంటి మల్లికార్జున్, బుక్క శ్రీధర్, బెలిదె రాంనారాయణ, శ్రీరంగం నర్సయ్య, సందీప్, మాడిశెట్టి గౌతం పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## పేద కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

తరిగొప్పుల, మే 7: అపదలో ఉన్న పేద కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని కనిలకుంట్ల గ్రామానికి చెందిన బాషబోయిన రాజు ఇటీవల మృతి చెందారు. బుధవారం మృతిడి కుటుంబాన్ని నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మాశెట్టి సత్యనారాయణ క్వింటాలు బియ్యం, బీఆర్ఎస్ నాయకుడు గోలి సతీశ్‌గుప్తా 50 కిలోల బియ్యం, మండల అధికార ప్రతినిధి చిలివేరు లింగం 25 బియ్యం, మాజీ ఎంపీటీసీలు తాళ్లపల్లి పోషయ్య రూ. 2500, భూక్యా జూంలాల్ నాయక్ రూ.2000, మాజీ సర్పంచ్ దామెర ప్రభుదాస్ నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అంకం రాజారాం, సిద్దిని మహిపాల్, బత్తిని సురేందర్‌గౌడ్, బూస యాదయ్య, పరుమని కొమురయ్య, ఆవుల సంపత్, సొంటెక్క మొగిళి, సుంకరి రాజయ్య, నేతుల సత్తయ్య, సారయ్య, సుంకరి రవి, కనకరాజు, కొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు కరాటేలో సాధన చేయాలి



అక్షరకు బహుమతి అందిస్తున్న సీఐ జి.వేణు

స్టేషన్ ఘన్‌పూర్, మే 7 : చదువుతోపాటు కరాటేలో శిక్షణ పొంది ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సీఐ జీ వేణు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కరాటే సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ కరాటేతో పాటు ఆటలు నేర్చుకోవడంలో కృషి చేయాలని కోరారు. సమాజంలో మహిళలపై జరిగే దాడుల నుంచి రక్షించుకోవడానికి కరాటే దోహదపడుతుందన్నారు. టెన్త్ ఫలితాల్లో కడమంచి అక్షర 570 మార్కులు సాధించిన నేపథ్యంలో కరాటే అసోసియేషన్ నుంచి రూ.5 వేలు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ పెసరు సారయ్య, వంగ శ్రీనివాస్, గోనెల ఉపేందర్, పాదల రాజేష్, పొన్న కిషన్, శివ, మహ్మద్ జావిద్, మహ్మద్ రజాక్, చిలగాని శ్రీశాంత్ పాల్గొన్నారు.